
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
శనివారం 13 జూలై 2024 | 3



జిల్లాలో వర్షపాతం వివరాలు

అమలాపురం టౌన్, జూలై 12: జిల్లాలో శుక్రవారం సగటున 17.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా.. మండపేట 70, ఆత్రేయపురం 24.8, రాయవరం 10.2, రామచంద్రపురం 55.4, ఆలమూరు 25.2, రావులపాలెం 19.6, కొత్తపేట 12.4, కపిలేశ్వరపురం 7.2, కె.గంగవరం 6.6, ఐ.పోలవరం 15.4, ముమ్మిడివరం 13.4, అయినవిల్లి 24.2, పి.గన్నవరం 7.8, అంబాజీపేట 12.8, మామిడికుదురు 10.6, రాజోలు 12.2, మలికిపురం 15.6, సఖినేటిపల్లి 14.4, అల్లవరం 8.4, అమలాపురం 18.4, కాట్రేనికోన 4.8, ఉప్పలగుప్తం 3.6.

ఒక్క పులస.. రూ.24 వేలు

కోనసీమలో తొలిసారిగా చిక్కిన చేప





మలికిపురం/అంతర్వేది, జూలై 12: గోదావరి రంగు మారింది.. పులస వచ్చి పడింది.. మత్స్యకారులకు ఆనందం వేసింది.. ఎందుకంటే పులసకు డిమాండ్ అంతా ఇంతా కాదండోయ్.. చిక్కిందా అదృష్టం వలలో పడినట్టే మరి.. ఎందుకంటే దాని రుచే వేరు.. దాని ధరే వేరు.. సాధారణంగా చేప ధర ఎంత ఉంటుంది. ఏదైనా రూ.500 నుంచి రూ.1,000 మధ్యన ఉంటుంది. అయితే పులస ధర మాత్రం వేలల్లో ఉంటుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం రామరాజులంకలో శుక్రవారం బర్రే శ్రీను అనే మత్స్యకారుడి వలలో పులస చిక్కింది. దాని ధర తెలుసుకుంటే అయ్య బాబోయ్ అనక మానరు. రెండు కిలోల బరువు ఉన్న ఈ పులసను సఖినేటిపల్లి మండలం అప్పనరామునిలంకకు చెందిన మాజీ సర్పంచ్ బర్రే శ్రీను రూ.24 వేలకు కొనుగోలు చేశారు. ఈ సీజన్‌లో మొదటి పులస దక్కించుకున్నందుకు ఆయన ఆనందం వ్యక్తం చేశారు. పులస పులుసును బంధుమిత్రులతో పాటు హైదరాబాద్ మహా నగరానికి కూడా పంపించినట్టు తెలిపారు.

చేయూతేదీ!

- మహిళల ఎదురుచూపులు
- మార్చి 7న బటన్ నొక్కిన నాటి సీఎం జగన్
- నాలుగు నెలలు గడిచినా అందని సాయం
- జిల్లాలో 89,619 మంది లబ్ధిదారులు
- సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు





మార్చి 7న అమలాపురంలో నామమాత్రంగా లబ్ధిదారులకు చేయూత చెక్కుల పంపిణీ (పాత చిత్రం)

అక్కా.. నీ చేయూత డబ్బులు బ్యాంకులో పడ్డాయా. అప్పుడే నాలుగు నెలలు అయిపోయింది. అసలు ఆ సాయం అందుతుందా లేదా. ఏ ఇద్దరు మహిళలు కలుసుకున్నా ఇవే మాటలు. ఎప్పుడో సార్వత్రిక ఎన్నికలకు ముందు బటన్ నొక్కారు. ఆ సొమ్ములు మాత్రం ఇంతవరకు రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు వస్తాయా రావా అన్న నైరాశ్యంలో పడిపోయారు.

అమలాపురం రూరల్, జూలై 12: 'వైఎస్సార్ చేయూత' పథకం కింద 45 నుంచి 60 ఏళ్లలోపు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు ఏటా రూ.18,750 చొప్పున సాయం అందించేవారు. నాల్గో విడత చేయూత సొమ్ములను అప్పటి సీఎం జగన్ అనకాపల్లిలో బటన్ నొక్కి అట్టహాసంగా విడుదల చేశారు. 14 రోజుల పాటు పండుగ వాతావరణంలో చేయూత సాయం అందజేస్తామని ప్రకటించారు. అప్పటి నుంచి ఏరోజుకారోజు లబ్ధిదారులైన మహిళలు బ్యాంకులో సొమ్ములు జమ అయ్యాయేమోనని సెల్‌ఫోన్లకు వచ్చే మెసేజ్‌లను చూసుకుంటూ సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. బటన్ నొక్కిన తొలినాళ్లల్లో నామమాత్రపు లబ్ధిదారులకు మాత్రమే సాయం అందింది. చిత్రమేమిటంటే చేయూత పథకం కింద ఇంతవరకు ఎంత మందికి సాయం అందిందో కూడా తెలియని అయోమయ పరిస్థితి అధికారుల్లో నెలకొంది.

జిల్లాలో 89,619 మంది లబ్ధిదారులకు రూ.168.03 కోట్లను జమ చేస్తున్నట్టు అప్పట్లో జగన్ ప్రకటించారు. నామమాత్రంగా కూడా లబ్ధిదారులకు ఇంతవరకు సాయం అందలేదు. జగన్ బటన్ నొక్కిన తర్వాత రెండు, మూడు రోజుల్లోనే నగదు సాయం అందుతుందని అప్పట్లో అధికారులు, వలంటీర్లు లబ్ధిదారులకు భరోసా కల్పించారు. రోజులు గడిచిపోతున్నా బ్యాంకు ఖాతాల్లో సొమ్ములు జమకాకపోవడంతో అప్పట్లోనే పలువురు మహిళలు అధికారులను ప్రశ్నించారు. మార్చి 16 నుంచి సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దానిని బూచిగా చూపించి, సాంకేతిక ఇబ్బందులను సాకుగా చూపించి అధికారులు గడిపేశారు. చివరకు సార్వత్రిక ఎన్నికల ఓటింగ్ సమయంలో కూడా జగన్ ప్రభుత్వం సొమ్ములు జమ చేసేందుకు ముందుకు వచ్చినట్టు ప్రకటించారు. అయితే ఎన్నికలు అయిన తర్వాత మాత్రమే సొమ్ములు జమ చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. ఎన్నికల తంతూ ముగిసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అయినప్పటికీ చేయూత సొమ్ము మాత్రం మహిళల ఖాతాల్లో జమ కాలేదు.

కార్పొరేషన్ల వారీగా నగదు సాయం...

చేయూత పథకం కింద లబ్ధిదారులకు ఆయా కార్పొరేషన్ల ద్వారా సొమ్ములు జమ చేస్తామని అప్పట్లో అధికారులు ప్రకటించారు. అసలు కార్పొరేషన్లలో సొమ్ములే లేకపోతే ఇక మహిళలకు ఏ విధంగా సాయం అందుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేశామంటూ గొప్పలు చెప్పిన జగన్ ప్రభుత్వం బటన్ నొక్కడమే తప్ప లబ్ధిదారులకు చేరేలా నిధులను సమీకరించి విడుదల చేయలేదని కొందరు విమర్శిస్తున్నారు. చేయూత కోసం సచివాలయాలకు వెళ్తుంటే సిబ్బంది చేతులెత్తేస్తున్నారు.ప్రస్తుతం ఆ సైట్ ఓపెన్ కావట్లేదని, లేదని, తామేమీ చేయలేమని చెప్తున్నారు. బటన్ నొక్కడంపై చూపించిన శ్రద్ధ నిధులు సమకూర్చడంలో పెట్టి ఉంటే అర్హులైన పేద లబ్ధిదారులకు అన్యాయం జరిగేది కాదని పలువురు మహిళలు వ్యాఖ్యానిస్తున్నారు. చేయూత నిధులు విడుదలయ్యేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారంతా ముక్త కంఠంతో కోరుతున్నారు. ఈ విషయమై జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ వి.శివశంకరప్రసాద్‌ను వివరణ కోరగా.. 'ప్రస్తుతం ఆన్‌లైన్‌లో సైట్ పనిచేయడం లేదు. ఎంతమంది లబ్ధిదారులకు చేయూత అందిందో తెలియదు. ప్రభుత్వం సమీక్ష చేసిన అనంతరం గానీ ఏ విధమైన చర్యలు తీసుకుంటుందో చెప్పలేం' అన్నారు.





కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

భూ హక్కు వివరాలను డిజిటల్ చేసి అంతర్జాలంలో అందుబాటులో ఉంచాలి

అమలాపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి):

భూ హక్కు వివరాలను డిజిటల్ రూపంలోకి మార్చి అంతర్జాలంలో అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. చుక్కల భూములు, ఈనాం భూములు, భూమి రికార్డులు, జమాబందీ, పాస్ పుస్తకాల ధ్రువపత్రాలు, కుల, ఆదాయ నివాస ధ్రువపత్రాలు వంటివన్నీ ఆన్‌లైన్‌లోనే అందజేయాలన్నారు. భూపరిపాలన వ్యవహారాలతో పాటు పౌర సేవలను సకాలంలో అందించి సుపరిపాలన దిశగా ముందడుగు వేయాలన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లాలోని ఆర్డీవోలు, తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూపరిపాలనా వ్యవహారాలను పర్యవేక్షించే ముఖ్యమైన వ్యవస్థ రెవెన్యూ అన్నారు. భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. భూముల రిజిస్ట్రేషన్లలో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ భూములు అన్యాక్రాంతం కాకుండా క్రయ, విక్రయాలు నిర్వహించాలన్నారు. రీసర్వే ప్రక్రియపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఐదేళ్ల లీజుకు ఇచ్చిన లంక భూములపై ఆరా తీశారు. జాతీయ రహదారి 216, కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైన్ భూసేకరణ ప్రక్రియపై ఆయా మండలాల వారీగా తహసీల్దార్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆక్వాచెరువుల విస్తీర్ణం సమగ్రంగా ఉండాలన్నారు. వెబ్‌ల్యాండ్ నిర్వహణ, రెవెన్యూ రికార్డుల స్వచ్ఛీకరణ, సీటీ తీరువా వసూళ్లు తదితర అంశాలపై సమీక్షించారు. రీసర్వే అనంతరం కూడాభూములు ఆక్రమణలకు గురయ్యాయని ఫిర్యాదులు అందుతున్న విషయంపైప్రశ్నించారు. పౌరులకు అవసరమైన ధ్రువపత్రాలను నిబంధనల మేరకు సకాలంలో అందించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు ఎస్.సుధాసాగర్, జి.కేశవర్ధనరెడ్డి, జీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో దుర్గారావుదొర

క్యాన్సర్ స్క్రీనింగ్‌పై 616 మందికి శిక్షణ

రామచంద్రపురం (ద్రాక్షారామ), జూలై 12: క్యాన్సర్ స్ర్కీనింగ్‌పై గత నెల 13 నుంచి అమలాపురం, రామచంద్రపురం ఏరియా ఆసుపత్రుల్లో కొత్తపేట, రామచంద్రపురం, అమలాపురం డివిజన్లకు చెందిన వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌వో, ఏఎన్ఎంలు 616 మంది శిక్షణ పొందారని జిల్లా వైద్య-ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎం.దుర్గారావుదొర తెలిపారు. రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో జరుగుతున్న శిక్షణా తరగతులను శుక్రవారం ఆయన పరిశీలించారు. దేశంలో ఏడాదికి 14 లక్షల క్యాన్సర్ కేసులు వస్తున్నాయని, అందులో 7 లక్షల మంది మరణిస్తున్నారని తెలిపారు. శిక్షణ పొందిన వైద్యులు, సిబ్బంది పట్టణాలు, గ్రామాల్లో క్యాన్సర్ వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి త్వరితగతిన చికిత్స అందజేసి మరణాల రేటు తగ్గించేందుకు కృషి చేస్తారన్నారు. డివిజనల్ వైద్యాధికారిణి డాక్టర్ ఎన్.ప్రశాంతి, డివిజనల్ పర్యవేక్షకుడు జి.కమలసోము, పలువురు వైద్యులు పాల్గొన్నారు.



ఏనుగులమహాల్ వద్ద బలహీనంగా ఏటిగట్టు

ఏటిగట్లు బలహీనం

వరద తాత్కాలిక మరమ్మతులకే నిధులు

ఈ సీజన్లోనూ అభివృద్ధి పనులు లేనట్టేనా!

కొత్తపేట, జూలై 12:

ఏటిగట్లు బాగా బలహీనపడ్డాయి.. అయితే వాటిని ప్రస్తుత వరద సీజను ముంపు నుంచి కాపాడుకునేందుకే తప్ప శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులు లేనట్టేనని తెలుస్తోంది. గోదావరి నది గౌతమి, వశిష్ట, వైనతేయ పాయలు కింద విడిపోయి ఉభయ గోదావరి జిల్లాలను ఆనుకుని ప్రవహిస్తుంది. 2006లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఏటిగట్ల ఎత్తును పెంచి అభివృద్ధి చేసినప్పటికీ సాంకేతిక కారణాలతో కొన్నిచోట్ల అభివృద్ధి పనులు నిలిపివేశారు. బొబ్బర్లంక నుంచి అన్నంపల్లి వరకు గల గౌతమి పాయ మధ్యలో కొత్తపేట మండలం వానపల్లి, వాడపాలెం, బోడిపాలెం, మందపల్లి, కొమరాజులంక, ఆత్రేయపురం ప్రాంతాల్లో ఏటిగట్టును అభివృద్ధి చేయకుండా వదిలేశారు. ఆ గట్లు ఇప్పుడు బలహీనపడ్డాయి. గోదావరి వరద పోటు పెరిగినప్పుడు ఈ వదిలేసిన గట్లకు సమాంతరంగా వరద నీరు గట్లను తాకుతూ ఆయా ప్రాంతాల ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. సంబంధిత హెడ్‌వర్క్స్ అధికారులు తాత్కాలిక రక్షణ చర్యల కింద ఇసుక బస్తాలతో గట్టుకు రక్షణ ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారు. గత 15 ఏళ్లుగా ఇలాగే కొనసాగిస్తున్నారు. అయితే ఇప్పుడు కూడా ఏటిగట్ల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపించినప్పటికీ నిధులు విడుదల కాలేదు. తాత్కాలిక మరమ్మతులకే నిధుల విడుదలకు అనుమతులు వచ్చాయని అధికారులు చెప్తున్నారు. అయితే ఈసారి వరదలు ఉధృతమైతే బలహీన ఏటిగట్లుగా ఉన్నచోట్ల ముప్పు తప్పదని ఆ ప్రాంతవాసులు ఆందోళన చెందుతున్నారు. బలహీనంగా ఉన్న ఏటిగట్లను గుర్తించి యుద్ధప్రాతిపదికన అభివృద్ధి చేయాలని వారు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం... నిధులు విడుదల కాలేదు

శివప్రసాద్, హెడ్‌వర్క్స్ ఏఈ, కొత్తపేట

బలహీనమైన ఏటిగట్లను గుర్తించి గత ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినా నిధులు విడుదల కాలేదు. నూతన ప్రభుత్వంలో ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపిస్తున్నాము. తాత్కాలిక చర్యలు చేపట్టడానికి రూ.15లక్షలు మంజూరయ్యాయి. వాటికి టెండర్లు పిలుస్తున్నాము. ముఖ్యంగా బలహీనంగా ఉన్నచోట తాత్కాలిక పటిష్టతకు చర్యలు తీసుకుంటాము.





కొత్తపేట బోడిపాలెం సమీపంలో గౌతమి కుడి ఏటిగట్టును ఎత్తు చేయకుండా వదిలేసిన దృశ్యాలు



ఆషాఢ అలంకారం

అమలాపురం రూరల్, జూలై 12: గోకరకొండ వంశీయుల ఆరాధ్య దైవమై భక్తుల పూజలు అందుకుంటున్న నల్లమిల్లిలోని శ్రీసత్తెమ్మ తల్లిని ఆషాఢ మాస శుక్రవారం సందర్భంగా అరటి పండ్లు, ఆకు కూరలతో విశేషంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

కూనవరం మేజర్ డ్రెయిన్ ఆయకట్టులో

ముంపు సమస్య తీర్చాలి

కలెక్టర్‌కు కోనసీమ రైతు పరిరక్షణ సంఘం ప్రతినిధుల వినతి

అమలాపురం టౌన్, జూలై 12: కూనవరం మేజర్ డ్రెయిన్ ఆయకట్టు పరిధిలోని వ్యవసాయ పంట పొలాల ముంపు సమస్య తీర్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ది కోనసీమ రైతు పరిరక్షణ సంఘం ప్రతినిధులు శుక్రవారం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కూనవరం మేజర్ డ్రెయిన్‌కు అనుసంధానంగా రెండు మీడియం డ్రెయిన్లు, పదకొండు మైనర్ డ్రెయిన్లతో పాటు మురుగు బోదెల నుంచి వచ్చే ముంపునీరు కూనవరం మేజర్ డ్రెయిన్ నుంచి సముద్రంలో కలుస్తుందని వివరించారు. అమలాపురం రూరల్, కాట్రేనికోన మండలాల ఆయకట్టు భూములు కూడా ఈ డ్రెయిన్ పరిధిలోకే వస్తాయన్నారు. మైనర్ డ్రెయిన్లు, రెవెన్యూ డ్రెయిన్లను ఆధునికీకరించకపోవడం వల్ల, ముంపునీటి ప్రవాహ ఉధృతి తగ్గడం వల్ల కూనవరం మేజర్ డ్రెయిన్ స్ట్రయిట్ కట్ వద్ద ఇసుక మేటలు వేసి ఏటా వేలాది ఎకరాల్లో పంట పొలాలు ముంపు బారిన పడుతున్నాయని వివరించారు. రైతులు కోట్లాది రూపాయల పంటను కోల్పోవాల్సి వస్తోందన్నారు. కూనవరం మేజర్ డ్రెయిన్ మొగ వద్ద ఇసుక మేటలు తొలగించి ముంపు సమస్య లేకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. డ్రెయిన్లపై వలకట్లు తొలగించాలని, రబీ పంటకు విరామం ప్రకటించి డ్రెయిన్ల ఆధునికీకరణను పూర్తి స్థాయిలో చేపట్టాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో పరిరక్షణ సంఘం అధ్యక్షుడు యాళ్ల బ్రహ్మానందం, కార్యదర్శి అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, ఎ.సత్యనారాయణ, డీఎస్‌వీఎస్ మూర్తి ఉన్నారు.



కలెక్టర్ మహేష్‌కుమార్‌కి వినతిపత్రం ఇస్తున్న రైతు నాయకులు

ఎక్కడైనా 'పట్టు' పడతాం..





తేనె పట్టు చెట్లకే పట్టాలని లేదు కదా. అక్కడక్కడా ఇళ్ల వద్దా పట్టు పట్టడాన్ని చూస్తుంటాం. కానీ కాకినాడ స్మార్ట్ సిటీ ఆవరణలో వాటర్ ట్యాంక్‌పై ఎక్కడో శివారున, మెయిన్ రోడ్‌లోని యూనియన్ బ్యాంకు ఆవరణలో పట్టిన ఇన్నేసి తేనె పట్టులు అప్పుడప్పుడూ మాత్రమే ఇలా చూస్తుంటాం.

- ఫొటోగ్రాఫర్, కాకినాడ







రాజమహేంద్రవరం పుష్కరాలరేవు వద్ద 45 అడుగులకు చేరిన గోదావరి వరద.. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి సముద్రంలోకి వెళుతున్న వరద నీరు

పెరుగుతున్న గోదావరి వరద

74 వేల క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల

రాజమహేంద్రవరం సిటీ, జూలై 12 : ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు గోదావరి నదీ వరద ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. ప్రతి ఏటా గోదావరికి జూలై, ఆగస్టు నెలల్లో వరదలు వస్తాయి. మహారాష్ట్రలో వర్షాలు కురవడంతో ప్రవాహం సాధారణ స్థాయికి మించి ప్రవహిస్తోంది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం 74 వేల క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. పుష్కరాల రేవు వద్ద గోదావరి నీటిమట్టం 45 అడుగులకు చేరింది. ఈ నెలాఖరుకు గోదావరి వరద పోటెత్తే అవకాశం ఉంది.

ఆషాఢం.. గోరింటాకు



అలమూరు, జూలై 11: ఆషాఢ మాసం.. ఈ పేరు వినగానే గోరింటాకు గుర్తుకొస్తుంది.ఆషాఢానికి, గోరింటాకుకు ప్రత్యేక బంధం ఉంది. ఆషాఢ మాసంలో కొత్తగా పెళ్లైన యువతులు గోరింటాకు పెట్టుకునే సంప్రదాయం నేటికీ కొనసాగుతూనే ఉంది. వివిధ శుభ కార్యాలయాల్లో పాల్గొనే వారికి అరచేతులకు అలంకరణగా గోరింటాకు పెట్టుకోవడం తెలిసిందే. తొలకరి ఆరంభం ఆషాఢ మాసం కావడంతో గోరింటాకు చిగురిస్తుంది. లేత గోరింటాకు కోసి మెత్తగా రుబ్బి పెట్టుకుంటే బాగా పండుతుంది. పెళ్లికాని అమ్మాయిలకు ఎర్రగా పండితే మంచి మొగుడొస్తాడని పెద్దవాళ్లు ఆటపట్టిస్తుంటే ఆ యువతులు పొంగిపోతారు. ఈ గోరింటాకు ఎర్రగా పండి శరీరఛాయల నుంచి కళ్లకు ఇంపుగా కనిపిస్తాయి. ఆషాఢమాసంలో దొరికే గోరింటాకు లేలేతగా ఉండి శరీరంలో రసం త్వరగా ఇంకి చేతులు, కాళ్లు ఎర్రగా పండుతాయి.

ఎన్నో డిజైన్లలో అలంకరణ

గోరింటాకు పలు రకాలుగా తయారు చేస్తారు. ఈ ఆకును రోటిలో వేసి మెత్తగా రుబ్బుతారు. ఇందులో అనేక రకాల కలుపుతారు. ఇలా తయారైన గోరింటాకుతో చేతులకు చందమామచుక్కలు, నెలవంక, బంతి పువ్వు, వేళ్లచుట్టూ తొడుగులా పెడతారు. పాదాలకు పారాణి పెడతారు. ఈరకంగా గోరింటాకు పెట్టుకోవడం గ్రామీణ ప్రాంతాలలో ఎక్కువగా ఉంటుంది. పట్టణాలలో మార్కెట్లో దొరికే గోరింటాకు కోన్‌లతో ఓ రకరకాల డిజైన్లు చేతులకు పాదాలకు పెట్టుకుంటారు.

ఔషధాల గోరింటాకు

గోరింటాకులో సౌందర్య సాధనంగానే కాక ఔషధ గుణాలు కూడా కలిగి ఉంటుంది. కాళ్ల చేతులు అధికంగా నీటిలో నానడం వల్ల పుండ్లు పడుతుంటాయి. నువ్వుల నూనెలో గోరింటాకు వేసి మరిగించి తలకు రాసుకుంటే తలనొప్పి, వెంట్రుకలు తెల్లబడడం తగ్గుతుంది. ఆయుర్వేదంలో గోరింటాకును చర్మరోగాలకు, కాలేయ రోగాలకు, నోటిపూత వంటి రోగాలకు వాడతారు. కీళ్ల నొప్పులు, గోరింటాకు నూనె పైపూతగా వాడితే మంచి గుణం కనబడుతుంది.



సత్యదేవుడి ఆలయంలో హైకోర్టు న్యాయమూర్తి దుర్గాప్రసాద్

సత్యదేవుడి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి ప్రత్యేక పూజలు

అన్నవరం, జూలై 12: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో శుక్రవారం రాత్రి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాద్ స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మెట్ల మార్గంలో స్వామివారి సన్నిధికి విచ్చేయడం విశేషం. ఆయనకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీస్సులు అందజేయగా అధికారులు స్వామివారి ప్రసాదం అందజేశారు.




ఈవో రామచంద్రమోహన్‌కు విరాళం అందజేస్తున్న దాత

సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి రూ.3 లక్షల విరాళం

అన్నవరం, జూలై 12: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం విజయనగరానికి చెందిన అనుమలశెట్టి సాయి, సరస్వతీ దంపతులు రూ.3 లక్షలు విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని దాత ఆలయ ఈవో రామచంద్రమోహన్‌కు అందజేయగా దాతను ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రాష్ట్ర స్థాయి నాటిక పోటీలు



'కాశీ వాసీ రావయ్యా' నాటిక ప్రదర్శిస్తున్న దృశ్యం

పోర్టుసిటీ (కాకినాడ), జూలై 12 : అల్లూరి సీతారామరాజు నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 24వ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు కొనసాగుతున్నాయి. రెండో రోజు శుక్రవారం స్థానిక సూర్యకళా మందిరంలో నిర్వహించిన నాటిక ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కళా రంగంలో నిష్ణాతులైన వాడ్రేవు సుందరరావు, లంక రుద్రమూర్తి, తాడి సుబ్బారెడ్డిలకు పురస్కారాలు అందజేశారు. రెండో రోజు కార్యక్రమాల్ని సాహితీ స్రవంతి నగర అధ్యక్షుడు మార్ని జానకిరామ్‌చౌదరి ప్రారంభించగా, గోపాల్ అర్ నూరాబత్తుల జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు.

అలరించిన నాటిక ప్రదర్శనలు..

ఈ సందర్భంగా ప్రథమ ప్రదర్శనగా విశాఖపట్నానికి చెందిన కళాభినయ సంస్థ ఆధ్వర్యంలో 'కాశీ వాసీ రావయ్యా' నాటిక ప్రదర్శన జరిగింది. ఈ నాటికకు పీటీ మాధవ్ రచన చేయగా, కవిప్రసాద్ దర్శకత్వం వహించారు. ద్వితీయ ప్రదర్శనగా ఎన్‌టీఆర్ జిల్లా వెలగలేరుకు చెందిన వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో 'రాతి' నాటిక ప్రదర్శించారు. ఈ నాటికకు పోలుదాసు శ్రీనివాసరావు దర్శకత్వం వహించారు. తృతీయ కత్రపాడు ఉషోదయ కళానికేతన్ తరఫున 'విముక్తి' నాటిక ప్రదర్శించారు. ఈ నాటికకు చెరుకూరి సాంబశివరావు రచన, దర్శకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో కళాపరిషత్ గౌరవాధ్యక్షుడు కర్రి బామిరెడ్డి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్రి అచ్యుతరామిరెడ్డి, పంపన దయానందబాబు, ఉపాధ్యక్షులు ఎస్‌వీవీఎస్ఎన్ మూర్తితో పాటు బుర్రా పద్మనాభం, పి శివప్రసాద్, పడాల రవి, నాగిరెడ్డి సతీష్, కె పుల్లారావు పాల్గొన్నారు.

ఏపీ ఆర్‌సెట్‌లో భానురేఖకు 2వ ర్యాంకు



రాయవరం, జూన్12: పీహెచ్‌డీ (డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ) ప్రవేశానికి నిర్వహించిన ఏపీఆర్‌సెట్‌లో రాయవరం సాయితేజ విద్యానికేతన్ అకడమిక్ డైరెక్టర్ తేతల భానురేఖ రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించారు. గత నెల జూన్ 3వ తేదిన తిరుపతి వేంకటేశ్వర యూనివర్సిటీ నిర్వహించిన ఆర్‌సెట్‌లో అర్హత పొందిన అభ్యర్థులకు రాజమహేంద్రవరంలో మౌఖిక పరీక్షలు నిర్వహించారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 10 వేల మంది పట్టభద్రులు పరీక్షకు హాజరుకాగా 146 మార్కులతో రాష్ట్ర స్థాయిలో తాను 2వ ర్యాంకు సాధించానన్నారు. హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్ (హెచ్ఆర్ఎం)లో పీహెచ్‌డీ చేయాలనే లక్ష్యంతో తాను పరీక్షలకు హాజరైనట్లు భానురేఖ తెలిపారు. రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు సాధించిన భానురేఖను కేవీఆర్ ఆసుపత్రి అధినేత డాక్టర్ తేతలి నవీన్‌రెడ్డి, పలువురు ప్రముఖులు అభినందించారు.

18న ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్లు

కాకినాడ రూరల్, జూలై 12: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వివిధ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఇంటర్ ఒకేషనల్ కోర్సు ద్వారా రెండో ఏడాది డిప్లమో కోర్సులలో మిగిలిన సీట్లకు ఈనెల 18న కాకినాడ ఏపీటీలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎన్.జనార్దనరావు తెలిపారు. ఐవీసీ ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈనెల 16వ తేదీ సాయంత్రం అయిదు గంటలలోపు సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తిగల విద్యార్థులు రిజిస్ట్రేషన్ ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించాలని, ఇతర వివరాలకు 9291621549 నెంబర్లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

ఫోర్‌బై కెనాల్ వద్ద నీటిలో దిగిన

యువకుడి గల్లంతు



గల్లంతైన యువకుడు మురళీకృష్ణ (ఫైల్‌ఫొటో)

మోతుగూడెం, జూలై12:అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చింతలూరుకు చెందిన వీరి మురళీకృష్ణ (24) శుక్రవారం సాయంత్రం లోయర్ సీలేరు ప్రాజెక్టు వద్ద ఫోర్‌బై పవర్ కెనాల్‌లో కాలు జారిపడి గల్లంతయ్యాడు. మోతుగూడెం ఎస్ఐ గోపాలరావు తెలిపిన వివరాలు ప్రకారం అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చింతలూరు నుంచి వీరి మురళీకృష్ణ తన స్నేహితులైన సాయి రాజ్, దుర్గా, లక్ష్మణ్, గౌతమ్‌లతో కలిసి మోతుగూడెం పర్యాటక ప్రాంతాలను చూడటానికి శుక్రవారం వచ్చారు. సాయంత్రం 5 గంటల సమయంలో ఫోర్ బై పవర్ కెనాల్ (పువ్వు బ్రిడ్జి) వద్ద వీరి మురళీకృష్ణ కాలుజారి పడి గల్లంతయ్యాడు. రాత్రి వరకు గల్లంతైన మురళీకృష్ణ ఆచూకీ లభించలేదు. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సామర్లకోటలో ప్రమాదానికి గురైన కారు

బ్రిడ్జిపై కారు బీభత్సం

వ్యక్తికి గాయాలు.. సామర్లకోటలో ఘటన

సామర్లకోట, జూలై 12: సామర్లకోట ఓవర్ బ్రిడ్జి దిగువన అవుట్ పోస్ట్ పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో వేగంగా వెళుతున్న కారు శుక్రవారం బీభత్సం సృష్టించింది. ఎదురుగా వస్తున్న మోటార్‌సైకిల్‌ను ఢీకొని ఆ తర్వాత బిడ్జి ఫుట్‌పాత్ మార్గాన్ని ఢీకొని రక్షణ గోడపైకి దూసుకెళ్లింది. ఈ సంఘటనలో మోటార్ సైకిల్‌పై వెళుతున్న హంసవరంనకు చెందిన కట్టా నూకరాజును కారు వెనుక నుంచి ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తి హంసవరంలో ఆయిల్ కర్మాగారంలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తుంటాడని పోలీసులు తెలిపారు. బాధితుడిని హంసవరం టీడీపీ నాయకులు చల్లా బుజ్జి తదితరులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ఉన్నత చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కారును నడుపుతున్న డ్రైవర్‌కు అంతంత మాత్రంగానే డ్రైవింగ్ రావడం, అనుభవం లేకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. సామర్లకోట పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

డిక్కీలో పెట్టిన రూ.5.20 లక్షలు మాయం

దొమ్మేరులో బండి డిక్కీలో నుంచి కొట్టేసిన వైనం.. బాధితుడి సమాచారంతో విచారణ చేపట్టిన పోలీసులు

కొవ్వూరు, జూలై 12: బైక్ డిక్కీలో పెట్టిన రూ.5.20 లక్షల నగదును దుండగులు అపహరించినట్లు బాధితుడు వాపోయాడు. అనపర్తి మండలం మహేంద్రవాడకు చెందిన కర్రి సూర్యనారాయణరెడ్డి శుక్రవారం చాగల్లులో స్థలం విక్రయించడానికి వచ్చాడు. స్థలం కొనుగోలు చేస్తున్న వ్యక్తి అడ్వాన్సుగా రూ.5 లక్షలు ఇచ్చాడు. సొమ్ము తీసుకుని ఇంటికి బయలుదేరాడు. దొమ్మేరు గ్రామశివారు చౌదరి హోటల్ వద్ద మధ్యాహ్నం 3 గంటల సమయంలో భోజనానికి ఆగాడు. భోజనం చేసి అక్కడే కొంతసేపు కూర్చుని అడ్వాన్సుగా ఇచ్చిన సొమ్ము లెక్క చూసుకున్నాడు. అరగంట తరువాత అడ్వాన్సు సొమ్ము రూ.5 లక్షలు, తన వద్ద ఉన్న రూ.20 వేల నగదును బ్యాగ్‌లో పెట్టి మోటారుసైకిల్ డిక్కీలో పెట్టుకుని మళ్లీ ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో దొమ్మేరులోని టీ టైమ్ వద్ద ఆగాడు. టీ తాగి వచ్చి డిక్కీలో ఉంచిన సొమ్ము చూసుకుంటే డబ్బు బ్యాగ్ కనిపించకపోవడంతో బాధితుడు పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. సమాచారం తెలుసుకున్న సీఐ వి.జగదీశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని సూర్యనారాయణరెడ్డి భోజనం చేసిన హోటల్, టీ తాగిన టీ టైమ్‌తోపాటు మెయిన్‌రోడ్‌లోని దుకాణ యజమానులను, స్థానికులను విచారణ చేశారు. గుర్తుతెలియని యువకుడు చొక్కాలో ఏదో దాచుకుని వెళ్తున్నట్టు చూశామని స్థానికులు పోలీసులకు చెప్పినట్టు సమాచారం.

వచ్చే నెల 25న జాంపేట అర్బన్ బ్యాంక్ ఎన్నికలు

రాజమహేంద్రవరం, జూలై 12(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలో అర్బన్ బ్యాంక్‌ల ఎన్నికల సందడి మొదలైంది. ఇప్పటికే ఆర్యాపురం కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ నడుస్తోంది. ఈనెల 20న పోలింగ్ జరగనుంది. మరోవక్క, రాజమహేంద్రవరం కేంద్రంగా ఉన్న జాంపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నికల ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆగస్టు 25న ఎన్నికలు జరుగుతాయి. ఆగస్టు 16న నామినేషన్లు స్వీకరిస్తారు. 17న వాటిని పరిశీలించి 18న ఉపసంహరణ ముగిసిన వెంటనే పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పి. ప్రశాంతి ఈ నెల 8న నోటిఫికేషన్ జారీచేశారు. ఎన్నికల అధికారిగా రాజమండ్రి డివిజనల్ సహకార అధికారి ఎం.జగన్నాథరెడ్డిని నియమించారు. జాంపేట అర్బన్ బ్యాంక్‌కు 10 బ్రాంచిలు ఉన్నాయి. జాంపేట ప్రధాన బ్రాంచికాగా, మోరంపూడి, ధవళేశ్వరం, సీతంపేట, అనపర్తి, పెద్దాపురం, కాకినాడ, గోకవరం, ఏలూరు, కొవ్వూరుల లో బ్రాంచిలు ఉన్నాయి. దీని పాలకవర్గం కోసం 12 మంది డైరెక్టర్లను ఎన్నుకోవలసి ఉంది. ఈ బ్యాంక్ పరిధిలో మొత్తం 30,815 మంది ఓటర్లు ఉన్నారు.

క్వారీమార్కెట్ రైతుబజార్‌లో ఆనబకాయల రాశులు

ఒక్కో కాయ రూ.17కు విక్రయం



క్వారీ మార్కెట్‌లో విక్రయిస్తున్న ఆనబకాయలు

రాజమహేంద్రవరంఅర్బన్, జూలై12 : ఆనబకాయలు శుక్రవారం మార్కెట్లను ముంచెత్తాయి. దిగుబడికి వాతావరణం పూర్తిగా అనుకూలించడంతో రైతులు భారీఎత్తున ఆనబకాయలను మార్కెట్లకు తీసుకొస్తున్నారు. రాజమహేంద్రవరం క్వారీమార్కెట్ రైతు బజార్‌కు శుక్రవారం సీతానగరం ప్రాంతానికి చెందిన రైతు కూనవరం శ్రీను తన పొలంలో సాగు చేసిన ఆనబకాయలను విక్రయానికి తీసుకొచ్చాడు. భారీగా రాశి పోసి విక్రయాలు సాగించాడు. రైతుబజార్ అధికారులు రైతుకు గిట్టుబాటు ధర కల్పించడానికి ఒక్కో ఆనబకాయకు రూ.17 ధర పెట్టారు. పొలంలో మరిన్ని ఆనబకాయలు కోతకు సిద్ధంగా ఉన్నాయని రైతు శ్రీను తెలిపాడు. ఇలా ఒక్కసారిగా ఇబ్బడిముబ్బడిగా వచ్చే కూరగాయల విషయంలో మార్కెటింగ్‌శాఖ అధికారులు దృష్టి సారించి సర్‌ప్లస్‌గా ఉన్న సరుకును రైతుల నుంచి సేకరించి ఇతర రైతుబజార్లకు సర్దుబాటు చేయగలిగితే అటు రైతుకు, ఇటు వినియోగదారునికి మేలు కలుగుతుందనే భావన వ్యక్తమవుతోంది.

ఎవరీ 'అగంతకులు'

- ఇసుక ర్యాంపుల్లో కొన్నిచోట్ల ఇప్పటికీ దందాలే
- 3 యూనిట్ల లారీకి రూ.1300, 5 యూనిట్లు రూ.2600
- ఇవి ఇసుక ధరలు కాదు.. ప్రజాప్రతినిధుల పేరుతో వసూళ్లు
- చోద్యం చూస్తున్న సూపర్ వైజర్లు, అధికారులు



గోపాలపురం రీచ్ నుంచి ఇసుక తరలిస్తున్న 7 లారీలను పెరవలి సమీపంలో గురువారం పట్టుకున్న పోలీసులు

రాజమహేంద్రవరంసిటీ/రూరల్, జూలై12: రాష్ట్ర ప్రభుత్వం నూతన ఉచిత ఇసుక పాలసీని తెచ్చినప్పటికీ ఇప్పటికీ ఇంకా ఇసుక దందాలు కొనసాగుతున్నాయి. సీఎం చంద్రబాబు చాలా ప్రతిష్ఠాత్మకంగా ఉచిత ఇసుక పాలసీని తీసుకువచ్చారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఒక్క రూపాయి కూడా లాభాపేక్షలేకుండా ఇసుక సరఫరా అత్యంత పారదర్శకంగా జరగాలని వారు ఆకాంక్షించారు. ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోంది. ఇసుక ర్యాంప్‌లకు సంబంధం లేని వ్యక్తులు ర్యాంప్‌లలో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇదంతా సంబంధిత అధికారులు, సూపర్‌వైజర్ల సమక్షంలోనే జరుగుతుండడం ఆశ్చర్యకరంగా మారింది. కొంతమంది ఇసుక ర్యాంప్‌లకు సంబంధంలేని వ్యక్తులు జిల్లాలోని మనుగడలో ఉన్న అన్ని ఇసుక ర్యాంప్‌లను అనధికారికంగా పంచేసుకున్నారు. ర్యాంప్ వారీగా టన్నేజీని బట్టి వారికి చెల్లించాల్సిన డబ్బులను వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినవస్తున్నాయి. ముఖ్యంగా కడియపులంక బుర్రిలంక, ధవళేశ్వరం, గాయత్రి, కోటిలింగాలు, కాతేరు, వెంకటనగరం ఇసుక ర్యాంప్‌లలో 3 యూనిట్ల లారీకి అదనంగా రూ.1300, 5, 6 యూనిట్ల లారీలకు రూ.2600 చొప్పున డబ్బులు కొంతమంది వ్యక్తులు వసూలు చేయడం విమర్శలకు తావిస్తోంది. ఇసుక కోసం వచ్చే వినియోగదారులు ర్యాంప్‌ల వద్దకు వచ్చి టన్ను రూ.420కు కొనుగోలు చేసుకుని కిరాయితో కలిపి ఇంటికి చేర కింద వారు వేసుకున్న అంచనాలకు అక్కడ అదనంగా ప్రజాప్రతినిధుల పేరుతో అదనపు వసూళ్లు చేస్తున్న తీరుకు సగటు వినియోగదారులు అవాక్కవుతున్నారు. వాస్తవానికి ర్యాంప్‌లలో ఇసుక టన్నుకు రూ.420 చొప్పున పది టన్నులకు రూ.4200, ఇరవై టన్నులకు రూ.8400 చొప్పున ఆన్‌లైన్ లింక్ ద్వారా వినియోగదారులు చెల్లింపులు చేస్తున్నారు. దీనికి అదనంగా కొంతమంది లారీ డ్రైవర్లు వినియోగదారుల వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. వాస్తవానికి ఇసుక కావాలంటే వినియోగదారుడు లారీ డ్రైవర్, ఓనర్లను సంప్రదిస్తారు. ఇప్పుడు ఇంటిప్లాన్‌లు, ఆధార్ కార్డులను ఇసుక కావాల్సిన వారి వద్ద నుంచి తీసుకుంటున్న డ్రైవర్లు ఇసుక, రవాణాకు కలిపి వినియోగదారుల నుంచి డబ్బులు తీసుకుని ర్యాంప్‌లకు వచ్చి అక్కడ ఆన్‌లైన్ పేమెంట్స్ చేసి ఇసుక వినియోగదాలకు చేరుస్తున్నారు. నేరుగా చెల్లించిన ఇసుక పట్టుకెళ్లేందుకు వచ్చేవారు తక్కువ. ఈనేపథ్యంలో ఆన్‌లైన్ పేమెంట్ కాకుండా కొంతమంది ర్యాంపులో అదనంగా 20 టన్నులకు రూ.2600 వసూలు చేస్తుండడంతో లారీ డ్రైవర్లు చిక్కుల్లో పడుతున్నారు. అదనంగా వసూలు చేసిన భారం వినియోగదారుడుపై వేస్తే వాళ్లు ఒప్పుకోవడంలేదు. ర్యాంపులోనే ఈ సొమ్ములు కట్టాల్సి వస్తోందని చెబుతున్నా వినియోగదారులు వినడం లేదని డ్రైవర్లు వాపోతున్నారు. ఇలా ఇసుక ర్యాంప్‌లలో కొందరు ప్రజాప్రతినిధుల మనుషులం అంటూ అక్రమ వసూళ్లకు పాల్పడుతుండడం విమర్శలకు దారితీస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ప్రజలకు ఇసుకను అందిస్తుంటే కొంతమంది ఇలా అక్రమ వసూళ్లకు దిగడంపై పలువురు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. ఇసుక ర్యాంప్‌లలో సూపర్‌వైజర్లుగాను, ఇతర బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారులు సైతం ఈ అదనపు వసూళ్లను అడ్డుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఉచిత ఇసుక ఉద్దేశానికి తూట్లు పొడిచే ఇలాంటి చర్యలపై దృష్టిపెట్టాలని పలువురు కోరుతున్నారు. అలాగే కొన్ని రీచ్‌ల నుంచి బిల్లులు లేకుండా ఇసుక తరలిపోతోందనే ఆరోపణలు వినవస్తున్నాయి. రెండు రోజుల కిందట పెరవలి సమీపంలో ఏడు లారీల్లో 150 టన్నుల ఇసుక తరలిస్తుండగా అధికారులు, పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. ఇప్పటికైనా అధికారులు ఇటువంటి వాటిపై దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.

నేడు బ్రాహ్మణ ఆత్మీయ సమావేశం

ఐ.పోలవరం, జూలై12: ముమ్మిడివరంలో నేడు శనివారం నలమాటి వారి కళ్యాణ మండపంలో బ్రాహ్మణసంఘ ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు అర్చక పురోహిత సంఘ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ముమ్మిడివరం ఎమ్మెల్యేగా రెండోసారి ఎన్నికైన దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు)ను సంఘం ఆధ్వర్యంలో సత్కరిస్తామని వారు తెలిపారు.

వర్షాకాలంలో వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలి

● సాదాసీదాగా మండపేట మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వాసు

మండపేట, జూలై12: మండపేట మండల పరిషత్ సమావేశం ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాసు అధ్యక్షతన శుక్ర వారం జరిగింది. వర్షాకాలం అంటువ్యాధులు ప్రబలకుండా శానిటేషన్‌పై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ వాసు అధికా రులను కోరారు. సమావేశానికి మండల ప్రత్యేకాధికారి రామకృష్ణ హాజరయ్యారు. సమావేశానికి హాజరైన వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. శాఖలవారీగా ఆయా శాఖల అధికారులు మండలంలో వున్న గ్రామాల్లో జరుగు తున్న అభివృద్ధి పనులను వివరించారు. కేశవరం ప్రభుత్వ వైద్యాధికారిణి లత మాట్లాడుతూ వానాకాలం వచ్చే వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేశామని చిన్నపిల్లలు వ్యాధుల బారిన పడకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవటంతో పాటు ప్రజలను అప్రమత్తం చేశామన్నారు. మండపేట వ్యవసాయాధికారి యేసుబాబు మాట్లాడుతూ మండపేట మండలంలో 16వేల ఎకరాల్లో వరిసాగవుతుందని ఇప్పటి వరకు 50శాతం మేర నాట్లు పూర్తయ్యాయని ఆయన చెప్పారు. మండల విద్యాధికారి సోమిరెడ్డి మాట్లాడుతూ మండలంలో నాడునేడు పనులు గురించి వివరించారు. ఆర్‌.డబ్ల్యుఎస్‌. ఏఈ బాగ్యరాజ్ మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న మంచినీటి పథకాలు గురించి వివరించారు. ఎంపీపీ మాట్లాడుతూ నూతన ప్రభుత్వం అమ్మఒడి పథకంద్వారా ప్రతి ఆడపిల్లలకు ఇచ్చే రూ.15వేలు అందరికీ అందించాలని కోరారు. మండలంలో లోవోల్టేజీ ఉన్న గ్రామాల్లో సమస్య పరిష్కారంకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పలు అంశాలతోపాటు, మండలానికి సంబంధించిన బడ్జెట్‌ను ఆమోదించారు. సమావేశంలో వైఎస్ ఎంపీపీ పనుమర్తి నాగేశ్వరరావు, జట్పీటీసీ కూరపూడి భవాని, ఎంపీడీవో శ్రీదేవి, ఈవోఆర్‌డీ ఐదంరాజు, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా పనిచేద్దాం: ఎమ్మెల్యే దేవ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్

మలికిపురం, జూలై 12: మండల పరిషత్ మంజూరు చేసే నిధులను దామాషా ప్రకారం ఇవ్వాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మండల పరిషత్‌కు చెందిన నిధులను కొన్ని గ్రామాలకు మంజూరు చేయడంలో వ్యత్యాసం ఉందని సర్పంచ్‌లు ప్రశ్నించగా ఎమ్మెల్యే అధికారులకు పై విధంగా సూచించారు. మలికిపురం మండల పరిషత్ సమావేశం ఎంపీపీ ఎంవీ సత్యవాణి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో మంచినీరు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని, ప్రణాళికాబద్ధంగా పనిచేద్దామన్నారు. గోగన్నమఠం డ్రెయిన్ ఎనిమిది కిలోమీటర్ల పరిధిలో ఆక్రమణలకు గురవ్వడంతో రైతులు క్రాప్ హాలిడే ప్రకటించే పరిస్థితి నెలకొందన్నారు. గోగన్నమఠం డ్రెయిన్ ఆక్రమణలను తొలగించడానికి అంతా సహకరించాలని కోరారు. ఆక్రమణలోని చెరువులకు అక్రమంగా మంజూరు చేసిన విద్యుత్ కనెక్షన్లను వెంటనే తొలగించాలని విద్యుత్ శాఖ ఏఈ సతీష్‌ను ఆదేశించారు. గ్రామాలను క్లస్టర్‌గా గుర్తించి డంపింగ్ యార్డులు ఏర్పాటు చేయడానికి రెవెన్యూ అధికారులు భూములను గుర్తించాలన్నారు. కార్యదర్శులు అనధికారి లే-అవుట్లకు అనుమతులిస్తే చర్యలు తప్పవన్నారు. పలువురు సర్పంచ్‌లు పలు సమస్యలపై ప్రశ్నించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ కండికట్ల నిర్మల, జడ్పీటీసీ బళ్ల ప్రసన్నరాణి, ఇన్‌చార్జి ఎంపీడీవో మంగాదేవి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

'రైల్వే కౌంటర్‌ను గతంలో మాదిరిగా కొనసాగించాలి'



ఎంపీ హరీష్‌మాధుర్‌ను సత్కరిస్తున్న రైల్వే సాధనసమితి నాయకులు

అమలాపురం టౌన్, జూలై 12: రైల్వే కౌంటర్‌ను గతంలో మాదిరిగా అమలాపురం మున్సిపల్ సర్క్యులర్ బజార్‌లో కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ ఆధ్వర్యంలో రైల్వే సాధన సమితి ప్రతినిధులు శుక్రవారం ఎంపీ హరీష్ బాలయోగికి వినతిపత్రం అందజేశారు. రైల్వే కౌంటర్‌ను పోస్టాఫీసులోకి మార్చడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రైల్వేలైన్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని, బాలయోగి ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉప్పుగంటి భాస్కరరావు, సప్పా నాగేశ్వరరావు, బీఎస్ మూర్తి పాల్గొన్నారు.

కలెక్టర్‌కు అభినందనలు



కలెక్టర్ మహేష్‌కుమార్‌ను అభినందిస్తున్న మాతా రమాబాయి అంబేద్కర్ ఫౌండేషన్ సభ్యులు

అమలాపురం టౌన్, జూలై 12: మాతా రమాబాయి అంబేడ్కర్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ పుణ్యమంతుల రజని ఆధ్వర్యంలో కలెక్టర్ ఆర్‌.మహేష్ కుమార్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకుని అభినందించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో బీర ప్రమీల, తాళ్ల లలిత, విప్పర్తి లక్ష్మీసరస్వతి, కండికట్ల సుభాషిణి, గుర్రాల సుజాత, దేవరపల్లి సత్యవతి, మోర్త ఇందిర, కొల్లు వరలక్ష్మి, తాళ్ల పద్మ పాల్గొన్నారు.

పుట్టినరోజు వేడుకల్లో ఘర్షణ

ఇరు వర్గాలకు స్వల్ప గాయాలు



రాజోలులో రెండు వర్గాల నాయకులను విడదీస్తున్న ఎస్‌ఐ పృథ్వి

రాజోలు, జూలై 12: రాజోలు నియోజకవర్గంలో జనసేన పార్టీలో ఉన్న రెండు వర్గాల విభేదాలు ఒక్కసారిగా రోడ్డెక్కడంతో ఆధిపత్య పోరు కొనసాగుతుంది. జనసేన పార్టీ నాయకులు తెలిపిన వివరాల ప్రకారం రాజోలు రోటరీ క్లబ్‌లో రాజోలుకు చెందిన జనసేన నాయకురాలు కుమారుడు పుట్టినరోజు వేడుకలు శుక్రవారం జరిగాయి. ఈ వేడుకల్లో జనసేన పార్టీ నాయకులు, ఎన్‌ఆర్‌ఐ యెనుముల వెంకటపతిరాజు, దిరిశాల బాలాజీ వర్గీయులకు మాటామాటా పెరగడంతో ఘర్షణకు దారితీసింది. గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో ఈ రెండు వర్గాల నాయకులకు పరస్పర విమర్శలు చేసుకుంటున్నారు. పుట్టినరోజు వేడుకల్లో ఈ రెండువర్గాల జనసేనపార్టీ నాయకులు కొట్టుకోవడంతో రోడ్డెక్కాయి. రాజోలు జాతీయ రహదారి 216 పైకి ఈ రెండువర్గాల నాయకులు పిడిగుద్దులు గుద్దుకున్నారు. ఈ సమాచారం అందుకున్న రాజోలు ఎస్‌ఐ జి.పృథ్వి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. జనసేన పార్టీ నాయకులకు పోలీసులు ఎంత చెప్పినా వెనక్కి తగ్గలేదు. ఈ రెండు వర్గాల నాయకుల మధ్య కొట్లాట తీవ్రమవడంతో పోలీసులు ఇరువర్గాల నాయకులను చెల్లాచెదురు చేయడంతో కొట్లాట సర్దుమణిగింది.

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.2.18 లక్షలు

ఆత్రేయపురం, జూలై 12: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,18,405 లభించినట్లు డిప్యూటీ కమిషనరు, ఈవో బి.కిషోర్‌కుమార్ తెలిపారు.

అన్నదాన ట్రస్టుకు రూ.55వేలు విరాళం

ర్యాలి జగన్మోహినీకేశవస్వామి అన్నదాన ట్రస్టుకు రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌కు చెందిన పి.మల్లికార్జున్-వాణి దంపతులు రూ.55,555 విరాళం సమర్పించారు. దాతకు ఈవో కృష్ణచైతన్య స్వామివారి చిత్రపటం అందజేశారు.

వీరేశ్వరస్వామికి రూ.లక్ష విరాళం అందజేత

ఐ.పోలవరం, జూలై 12: ఐ.పోలవరం మండలం మురమళ్ల శ్రీభద్రకాళీసమేత వీరేశ్వరస్వామివారి నిత్యాన్న దానం కోసం కాకినాడకు చెందిన వల్లూరి సుమిత్ర రూ.లక్ష విరాళంను ఆలయ పర్యవేక్షణాధికారి వీరభద్రరావుకు అందజేశారు. సుమిత్రకు ప్రత్యేక దర్శనం అందించిన అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు, అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ, తదితరులు ఉన్నారు.

నిత్యాన్నదానానికి రూ.10వేల విరాళం

మామిడికుదురు, జూలై 12: అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం నలమల కొండలరావు, వీరలక్ష్మి దంపతులు రూ.10వేలు విరాళంగా అందించారు.

పెద్దమ్మతల్లి ఆలయానికి పోటెత్తిన భక్తులు

మండపేట, జూలై 12: మండపేట ఏడిద రోడ్డులో ఉన్న శ్రీపెద్దమ్మతల్లి అమ్మవారి ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. ఆలయ ట్రస్టీ వాలిన వీరబాబు ఆలయానికి వచ్చిన భక్తులకు వసతులు కల్పించారు.

విజయదుర్గమ్మ వారికి కుంకుమ పూజ

మామిడికుదురు, జూలై 12: శ్రీవారాహీ అమ్మవారి నవరాత్రి పూజా మహోత్సవాన్ని పురస్కరించుకుని విజయదుర్గమ్మవారికి పలు పూజా కార్యక్రమాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నగరం గ్రామంలోని మొల్లేటివారి మెరక వద్దగల అమ్మవారి ఆలయంలో అమ్మవారిని శాకాంబరిదేవిగా అలంకరించి పూజలు చేశారు.

విగ్రహాలు ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

రాయవరం, జూలై 12: రామచంద్రపురం మండలం వెల్లలో డాక్టర్ అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ధ్వంసం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఏమార్పీఎస్ నాయకుడు లంక చందు డిమాండ్ చేశారు.

ట్రిపుల్ ఐటీకి తొండవరం విద్యార్థి

అంబాజీపేట, జూలై 12: మండలంలోని తొండవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన వాకపల్లి భవ్యశ్రీ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఈవో కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్‌లు తెలిపారు. హెచ్‌ఎం పీవీ కేశవాచార్యులు, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

గంగవరం విద్యార్థి ఎంపిక

కె.గంగవరం: ట్రిపుల్ ఐటీకి కె.గంగవరం ఉన్నత పాఠశాల విద్యార్థి ఓరుగంటి నాగమణి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.వెంకటేశ్వరరావు తెలిపారు. నాగమణిని ఎంఈవో 1 ఏ.నాగరాజు, ఎంఈవో2 చోడిశెట్టి అంజనేయులు, ఎంఆర్‌పీలు అభినందించారు.





ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ భర్త రేపూరి ఏసు, గ్రామస్థులు

అంతర్వేది, జూలై 12: సఖినేటిపల్లి మండలం సఖినేటిపల్లిలంక హైస్కూలులో ఈ విద్యా సంవత్సరంలో చేరిన ప్రతీ విద్యార్థికి పాఠశాల ఉపాధ్యాయ బృందం, గ్రామస్థుల సహకారంతో 36 సైకిళ్లను దాతల సహకారంతో పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులకు తరలిరావాలని, గ్రామంలో సమస్యలను పరిష్కరించడానికి ముందుగా పాఠశాల విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్టు స్థానిక సర్పంచ్ రేపూరి రాజేశ్వరి ఏసు నరసింహరాజ తెలిపారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ జి.సునీత, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు గునిశెట్టి రామ్‌జీ, ముచ్చర్ల వెంకటేష్ పాల్గొన్నారు.

బెజవాడ దుర్గమ్మకు ఆషాఢ సారె



దుర్గమ్మకు ఆషాఢ సారెను తీసుకువెళ్లిన ఉమ్మడి జిల్లాలోని భవానీలు

అమలాపురం టౌన్, జూలై 12: విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ కనకదుర్గమ్మకు పట్టణానికి చెందిన జై భవానీ సేవా సమితి అధ్యక్షుడు ఆర్లపల్లి ముత్యం గురుభవానీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆషాఢ సారె సమర్పించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన గురు భవానీలు, భవానీలు అమ్మవారిని దర్శించుకుని పసుపు, కుంకుమ, చీర, చలిమిడి పానకం సమర్పించారు.

జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడికి సత్కారం



దివి శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

అంతర్వేది, జూలై 12: సఖినేటిపల్లి మండలం అంతర్వేదిపాలెం గ్రామానికి చెందిన శ్రీసూర్య ట్రేడింగ్ కంపెనీ రైసుమిల్ అధినేత దివి శ్రీనివాసరావు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఎంపికకావడంతో స్థానిక నాయకులు శుక్రవారం ఆయన్ను సత్కరించారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్‌లు గొల్లమందల చిట్టిబాబు, ఇందుకూరి సుబ్బరాజు, మాజీ సర్పంచ్ ఈదరవిరెడ్డి, వీరవెంకటమోహనరావు (పండు), నల్లి సురేంద్ర పాల్గొన్నారు.

సూర్యబలిజ సంఘ నూతన కార్యవర్గం



ఎంపికైన సూర్యబలిజ సంఘ నూతన కార్యవర్గం

అమలాపురం టౌన్, జూలై 12: పట్టణంలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో సూర్యబలిజ సంఘం నూతన కార్యవర్గం గౌరవాధ్యక్షుడు మద్దుల రవినాగేశ్వరరావు, గౌరవ సలహాదారు ఎం.గోపాలకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రమాణస్వీకారం చేసింది. అధ్యక్షుడిగా బొ స్కర్ల రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా కాళే సురేష్, కార్యదర్శిగా యండమూరి శివకేశవ, సంయుక్త కార్యదర్శిగా పందిరి శ్రీనివాస్, కోశాధికారి ధరణికోట శ్రీనివాసరావు, అధికార ప్రతినిధిగా కాళే వెంకటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా కోటిపల్లి వీరబాబు, గూడూరి సురేష్, నరిదే రమణ, దుగ్గిరాల లక్ష్మీనరసింహారావు, ఘంటశాల వీరవెంకటసత్యనారాయణ, యండమూరి రాము, వాల్మీకి వీర్రాజు, అన్నాబత్తుల సత్తిబాబు ప్రమాణం చేశారు. తాటిపాక సర్పంచ్ కోటిపల్లి రత్నమాల, మద్దుల కాసుబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సూర్యబలిజ కులస్థులను బీసీ-డి నుంచి బీసీ-ఎకు మార్చి రిజర్వేషన్ వర్తింపజేయాలని కోరారు. సంఘానికి స్థలం కేటాయించి కమ్యూనిటీ భవనం నిర్మించాలని, నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలని తీర్మానించారు.

కార్యకర్తలందరికీ విధేయుడిగా పనిచేస్తా: ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం, జూలై 12: నియోజకవర్గంలోని కార్యకర్తలందరికి విధేయుడిగా ఉంటూ ఆయా గ్రామాల అభివృద్ధి, సంక్షేమంలో భాగస్వామినవుతానని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. నరేంద్రపురం గ్రామంలో గ్రామస్థులు ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమానికి సర్పంచ్ బీర వెంగ మాంబ అధ్యక్షత వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమం సమానంగా జరుగుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యేను దశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఎంపీటీసీ కొక్కిరి లక్ష్మి, సంసాని పెద్దిరాజు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, ముద్దా చంటి బాబు, వాసంశెట్టికుమార్, నక్కా సత్యనారాయణ, తోలేటి సత్తిబాబు, సాధనాల శ్రీవెంకటసత్య నారాయణ, శేరు శ్రీనుబాబు, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



తల్లిదండ్రులను సన్మానిస్తున్న అంగన్‌వాడీలు

మలికిపురం, జూలై 12: మలికిపురానికి చెందిన అక్కచెల్లెళ్లు కడలి కరుణ, రేవతి ఎస్‌ఐ ఉద్యోగాలకు ఎంపికై శిక్షణ పొందుతున్నారు. వారి అభ్యున్నతికి పాటుపడిన తల్లిదండ్రులు సుజాత-వెంకటేశ్వరరావులను అంగన్‌వాడీల తరఫున సీడీపీవో వైకేడీ రమాదేవి శుక్రవారం సన్మానించారు. హైమావతి, ప్రసన్న, సరోజిని, స్వాతి, డీఎం సుజాత, జ్ఞానేశ్వరి, చంద్ర పాల్గొన్నారు.

అమరావతి విట్‌కు కృత్తివెంటి విద్యార్థి ఎంపిక



రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 12: స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు జూనియర్ కళాశాల విద్యార్థి మంతెన సాయిపూజిత్ అమరావతి విట్‌లో బీటెక్ డేటా సైన్సు ఉచిత సీటుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పనుము సోమశేఖరరావు తెలిపారు. అమరావతి విట్ ఇంజనీరింగ్ కళాశాల జిల్లా నుంచి ఒక ప్రతిభగల విద్యార్థిని ఎంపిక చేస్తుంది. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి సాయిపూజిత్ ఎంపికయ్యాడు. ఇంటర్‌లో సాయి పూజిత్ 961మార్కులు సాధించాడు. రాయవరం గ్రామానికి చెందిన సాయిపూజిత్ తండ్రి వెల్డింగ్ వర్కర్‌కాగా, తల్లి గృహిణి. సాయిపూజిత్‌ను అధ్యాపకులు అభినందించారు.

రైతు బజార్‌లో బియ్యం, కందిపప్పు కౌంటర్ ప్రారంభం

మండపేట, జూలై 12: ప్రభుత్వం రైతుబజార్ ద్వారా నాణ్యమైన బియ్యం, కందిపప్పులను సబ్సిడీ ధరలకు విక్రయించేందుకు రైతుబజార్‌లో సివిల్‌సప్లయి రెవెన్యూశాఖ ద్వారా ప్రత్యేక కౌంటర్‌లను ఏర్పాటుచేసినట్లు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేట రైతుబజార్‌లో ఏర్పాటుచేసిన బియ్యం, కందిపప్పు విక్రయించే కౌంటర్ కేంద్రంను శుక్రవారం సాయంత్రం వేగుళ్ల ప్రారంభించారు. సన్న బియ్యం కిలో రూ.49, రూ.48కి, కందిపప్పు కిలో రూ.168కి విక్రయిస్తామని తహసీల్దార్ సురేష్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి, మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, మున్సిపల్ కమిషనర్ బి.రాము, మండపేట మండల టీడీపీ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, మున్సిపల్ వైఎస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, మున్సిపల్ కౌన్సిలర్‌లు, ఎస్టేట్ అధికారి బోళ్ల సతీష్ పాల్గొన్నారు.

'దివ్యాంగుల సంక్షేమానికి పాటుపడేది కూటమి ప్రభుత్వమే'

కొత్తపేట, జూలై 12: దివ్యాంగుల హక్కులు, వారి సంక్షేమానికి పాటుపడేది కూటమి ప్రభుత్వమేనని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శుక్రవారం స్థానిక రోటరీ కల్యాణ మండపంలో ప్రత్యేక ప్రతిభావంతుల సంస్థ డైరెక్టర్ బడుగు సుబ్బాయమ్మ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రతిభావంతుల హక్కుల అవగాహన సదస్సు నిర్వహించారు. గుంటూరు చైల్డ్‌రైట్స్ జాయింట్ యాక్షన్ కమిటీ, ల్యాంప్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్థిక సహకారంతో నియోజకవర్గ స్థాయిలో దీనిని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన సత్యానందరావు మాట్లాడుతూ దివ్యాంగులకు పింఛను రెట్టింపుచేసిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. ప్రత్యేక ప్రతిభావంతుల హక్కులపై ముద్రించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఎమ్మెల్యే బండారును ల్యాంప్ డైరెక్టర్ సాల్మన్‌పాల్ సత్కరించారు. టీడీపీ నాయకులు కంఠంశెట్టి శ్రీనివాస్‌మూర్తి, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

రావులపాలెం, జూలై 12: దివ్యాంగ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సమగ్ర శిక్ష సీఎంవో బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం కోరారు. శుక్రవారం ఆయన రావులపాలెంలోని భవిత సెంటరును పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. దివ్యాంగ విద్యార్థులకు వారి సామర్థ్యాల మేరకు ఆటపాటలు నిర్వహిస్తూ వారిలో మనోధైర్యం నింపాలన్నారు.

పంచాయతీ నిధులు దుర్వినియోగంపై విచారణ

మామిడికుదురు, జూలై 12: మొగలికుదురు గ్రామ పంచాయతీ నిధులను ఉప సర్పంచ్ గనసాల దీపిక, వార్డు సభ్యులు దుర్వినియోగం చేశారన్న ఆరోపణలపై శుక్రవారం అమలాపురం డీఎల్పీవో బొజ్జిరాజు విచారణ చేశారు. వేయని రోడ్లు వేశారని, వేయని మురికికాల్వ పనులు చేశారని సుమారు రూ.40లక్షల మేర దుర్వినియోగం చేశారని ఆరోపించారు. శుక్రవారం విచారణకు వచ్చిన డీఎల్పీవోకు పంచాయతీలో పనిచేసే డిజిటల్ అసిస్టెంట్ రాకపోవడం తదితర కారణాలవల్ల ఈనెల 16వ తేదీన అందరితో కూర్చుని పూర్తిస్థాయి విచారణ చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో నూదా బాబ్జి, మద్దింశెట్టి అబ్బు, బుజ్జి, దొంగ సత్యనారాయణ, కొండా జగదీష్, చింతా చిన్నా, తదితరులు పాల్గొన్నారు.

'ఏఎంసీ చైర్మన్ పదవి జనసేనకు కేటాయించాలి'

అల్లవరం, జూలై 12: వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని జనసేనకు చెందిన గుర్రం కృష్ణ(జీకే)కు కేటాయించాలని ఆ పార్టీ అల్లవరం మండల శాఖ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఆయనకు కూటమి నాయకులు మద్దతు తెలపాలని కోరారు. వచ్చే వారంలో అల్లవరం మండల శాఖ ఎన్నిక నిర్వహించాలని నిర్ణయించారు. కంకిపాటి వీరబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో మేడిద శంకరరావు, చిట్టినీడి శ్రీనివాస్, గుర్రం కృష్ణ, రొక్కాల నాగేశ్వరరావు, దాట్ల మంగతాయారు, కటికిరెడ్డి బాబీ, చికిలే చిట్టిబాబు, కంకిపాటి సుబ్బారావు, పిండి గణపయ్య, పిల్లా ప్రసాద్, నల్లా రాము తదితరులు పాల్గొన్నారు.

'యువతులు అన్ని రంగాల్లో ముందుండాలి'

రావులపాలెం, జూలై 12: యువతులు అన్ని రంగాల్లో ముందుండాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కోరారు. రావులపాలెంలోని సత్యసాయి సేవా కేంద్రంలో 40రోజులపాటు జరిగిన బ్యూటీషియన్ కోర్సు ముగింపు కార్యక్రమం జిల్లా అధ్యక్షుడు అడబాల కొండబాబు ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన బండారు కోర్సు పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలు అందజేశారు. గుత్తుల పట్టాభిరామారావు, కోట వెంకటేశ్వరరావు, సాధనాల వీరమణి, ట్రస్టు చైర్మన్ కొవ్వూరి వివేకానందరెడ్డి, కన్వీనర్ కొవ్వూరి బ్రహ్మారెడ్డి, పర్వతవర్ధనరావు పాల్గొన్నారు.

బోడసకుర్రులో బంగారం గొలుసు, నగదు చోరీ

అల్లవరం, జూలై 12: బోడసకుర్రు పల్లిపాలెంలో కొప్పిశెట్టి యర్రప్పశెట్టి ఇంట్లో బీరువాలో భద్రపరిచిన రెండున్నర కాసుల బంగారం గొలుసు, రూ.10వేల నగదును గుర్తు తెలియని వ్యక్తులు గురువారం అర్ధరాత్రి దొంగిలించుకుపోయారు. ఈమేరకు కొప్పిశెట్టి సత్యప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అల్లవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ధర్మారావు దంపతులకు సన్మానం

ముమ్మిడివరం, జూలై 12: మండలంలోని అయినాపురం సీలంవారిపేటలో తిరుకోటి సురేష్‌కుమార్ అధ్యక్షతన శుక్రవారం బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా మండల శాఖ సమావేశం జరిగింది. ప్రముఖ అంబేడ్కరీయుడు, బౌద్ధ ఉపాసకుడు, ఆర్టీసీలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన మిమ్మితి ధర్మారావు దంపతులను ఘనంగా సత్కరించారు. బౌద్ధ ఉపాసకుడు బి.శరత్ మాట్లాడుతూ ఈనెల 17న అమలాపురం అంబేడ్కర్ భవనంలో జరిగే బీవీ రమణయ్య జయంత్యుత్సవం, బౌద్ధ జీవన పరిచయ సదస్సుకు బౌద్ధులు, అంబేడ్కరీయులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాశి సింహాద్రివర్మ, కేఎస్‌ఎన్ మూర్తి, ఎం.హరికుమార్, చిరంజీవి, గెడ్డం వెంకటేశ్వరరావు, ఎన్.సత్యనారాయణ, డి.దుర్గాప్రసాద్, వెంకటరమణ, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు వంట సామగ్రి బహూకరణ

ముమ్మిడివరం, జూలై 12: మండలంలోని రాజేలంక పంచాయతీ పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు ఐ.పోలవరం మండలం మురమళ్లకు చెందిన వీధి చంటిబాబు రూ.10వేలు విలువైన వంట పాత్రలు, గోడ గడియారాన్ని సమకూర్చారు. శుక్రవారం వీటిని ప్రిన్సిపాల్ గంగాభవానీ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ వడ్డి శ్యామ్‌ప్రసాద్ సమక్షంలో అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకురాలు పద్మరాణి, ఉపాధ్యాయురాలు ప్రశాంతి, మాజీ చైర్మన్ వడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేపర్ బ్యాగ్ డే

మలికిపురం, జూలై 12: విశ్వేశ్వరాయపురంలోని వివేకానంద ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో శుక్రవారం పేపర్ బ్యాగ్ డే నిర్వహించారు. విద్యార్థులు స్వయంగా తయారుచేసిన పేపర్ బ్యాగ్‌లను ప్రదర్శించారు. 'ప్లాస్టిక్ బ్యాగ్‌లను నివారిద్దాం.. పేపర్ బ్యాగ్‌లు వాడదాం' అని నినాదాలు చేశారు. కార్యక్రమంలో పీవీవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కుప్పకూలిన రావిచెట్టు



పులిదిండిలో కుప్పకూలిన రావిచెట్టు

ఆత్రేయపురం, జూలై 12: మండలంలోని పులిదిండి గ్రామ ముఖ్య కూడలిలో వందల ఏళ్ల చరిత్ర కలిగిన రావిచెట్టు కుప్పకూలింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా శుక్రవారం మధ్యాహ్నం మహావృక్షం ఒక్కసారిగా ఒరిగిపోయింది. ఒకపక్క ప్రయాణికుల విశ్రాంతి భవనం, మరోపక్క హనుమాన్ విగ్రహం వున్నాయి. ఎటువంటి నష్టం సంభవించలేదు. ఆర్‌అండ్‌బీ, విద్యుత్ శాఖల అధికారులు వచ్చి రావిచెట్టును తొలగించారు.

విద్యార్థినిపట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి రిమాండు

అమలాపురం టౌన్, జూలై 12: చిందాడగరువు గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థిని పట్ల నక్కావారిపేటకు చెందిన గొల్లపల్లి కుమార చక్రవర్తి (32) అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ మేరకు అందిన ఫిర్యాదుపై అతడిని అరెస్టు చేసి పోక్సో చట్టంతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నిందితుడిని శుక్రవారం అమలాపురం ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా రిమాండు విధించారు. కొత్తపేట సబ్ జైలుకు తరలించినట్లు పట్టణ ఎస్‌ఐ కిశోర్‌బాబు తెలిపారు.

ఆకతాయిలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

అమలాపురం టౌన్, జూలై 12: ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆదేశాల మేరకు మహిళా విద్యార్థుల రక్షణలో భాగంగా కళాశాలలు, ఉన్నత పాఠశాలల వద్ద పోలీసు నిఘా పెంచారు. దీనిలో భాగంగా శుక్రవారం పట్టణ పరిధిలోని కళాశాలల వద్ద విద్యార్థినులను అల్లరి చేస్తున్న పదమూడు మంది ఆకతాయిలను అదుపులోకి తీసుకుని ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. బాలికలు స్కూళ్లు, కళాశాలలకు వెళ్లి వచ్చే సమయాల్లో ఆకతాయిలు ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ గంగాభవానీ హెచ్చరించారు. అంబాజీపేట ఏవీఎస్ జూనియర్ కళాశాల, దేవగుప్తం ప్రాథమిక పాఠశాలల్లో పోలీసులు ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌లపై అవగాహన కల్పించారు. గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ గురించి వివరించారు.

సొసైటీ మాజీ చైర్మన్ నందుల మృతి



అంబాజీపేట, జూలై 12: పుల్లేటికుర్రు సొసైటీ మాజీ చైర్మన్ నందుల ఆదినారాయణ(63) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. ఆదినారాయణ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన మృతిపట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

ఉచితంగా నోట్ పుస్తకాల పంపిణీ

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 12: పట్టణంలో వైఎస్‌ఆర్ నగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పలువురు దాతల సహకారంతో శుక్రవారం పీడీఎస్‌యూ నాయకులు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ద్రాక్షారామ శంకరనారాయణ బుక్‌స్టాల్, బాలాజీ బుక్‌స్టాల్, రామచంద్రపురం లావణ్యబుక్స్ సరస్వతి బుక్స్, పలివెల వెంకట్ సహకారంతో పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు బి.సిద్దూ, వెంటపల్లి భీమశంకరం, అంబటి కృష్ణ, కరిపోతుల నవీన్, చింతా రాజారెడ్డి, ఎస్.దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

29 మంది ఎఫ్‌టీసీఎల్ ఉద్యోగులు రెగ్యులర్

యానాం, జూలై 12: యానాం నియోజకవర్గంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న 29మంది ఫుల్‌టైమ్ క్యాజువల్ లేబర్(ఎఫ్‌టీసీఎల్) ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ పుదుచ్చేరి ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ముగ్గురు మినహా మిగిలిన 26 మంది ఉద్యోగులను పుదుచ్చేరిలోని వివిధ శాఖల్లో నియమించారు. దీంతో వీరు మరో రెండు మూడు రోజుల్లో పుదుచ్చేరిలో ఆయా శాఖల్లో విధుల్లో చేరనున్నారు. అలాగే వివిధశాఖల్లో పనిచేస్తున్న ఎఫ్‌టీసీఎల్ ఉద్యోగులకు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు విశేష కృషితోనే రెగ్యులర్ అయ్యాయనే నేపథ్యంలో మల్లాడి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా స్వీట్లు పంచి సీఎం రంగసామి, ఢిల్లీ ప్రతినిధి మల్లాడితో పాటు సహకరించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు బీఎస్సీ నర్సింగ్ ప్రవేశ పరీక్ష

యానాం, జూలై 12: పుదుచ్చేరిలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ సీట్ల భర్తీకి సంబంధించి బీఎస్సీ నర్సింగ్ ప్రవేశ పరీక్షను పుదుచ్చేరి ప్రభుత్వం తొలిసారిగా నిర్వహిస్తోంది. ఈనెల 14న ఆదివారం పుదుచ్చేరి, కారైకాల్, మహే, యానాం రీజియన్‌లలో ఈ పరీక్ష జరుగుతుంది. అభ్యర్థులు ఇప్పటికే సెంటాక్ వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు.

